క్లుప్తంగా

వృద్ధులను నిర్లక్ష్యం చేయొద్దు



గన్నవరం: కుటుంబ వృక్షానికి మూలమైన వృద్ధులను నిర్లక్ష్యం చేయకూడదని సీనియర్ సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు జాస్తి విజయ భూషణ్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సేవాభవన్‌లో ఆదివారం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజ సేవా తత్పరులైన పలువురు సీనియర్ సిటిజన్స్‌ను సత్కారించారు. అనంతరం జాస్తి మాట్లాడుతూ..వృద్ధులను ఆదుకోవడం మానవ ధర్మమన్నారు. వృద్ధుల గౌరవానికి భంగం కలగకుండా వారిని సంరక్షించుకోవడం పిల్లల బాధ్యతగా గుర్తించాలని చెప్పారు. అవసాన దశలో ఉన్న వృద్ధులకు ఆత్మీయ బంధాలను అందించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అవుటపల్లి మోహన్‌రావు, మాజీ అధ్యక్షుడు పెద్దు వెంకటరత్నం, పుర ప్రముఖులు మాధవి, బీ కృష్ణారావు, సాహెబ్, కోటేశ్వర రావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు



గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాదలో శనివారం రాత్రి ముస్తఫావలీ 58వ ఉరుసు ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక మహబూబ్ సుభాని జెండాల చెట్టు సమీపంలో ముజావర్ల ఇంటి వద్ద నుంచి గంధం ఊరేగింపు గ్రామంలో కొనసాగింది. ఫకీర్ల ఖవాలీలతో, మేళతాళాలతో హైస్కూల్ రోడ్డు, మసీద్, సూరంపల్లి రోడ్డు, గీతామందిరం మీదుగా కొండపై ఉన్న దర్గా వద్దకు భక్తులు చేరుకుని చాదర్ సమర్పించారు. వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



పెనమలూరు: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు చాలా విలువైందని ప్రతి ఒక్కరు రాజ్యాంగపరంగా సంక్రమించిన ఓటును సక్రమంగా వినియోగించుకోవాలని ఆర్డీవో విజయ్‌కుమార్ తెలిపారు. జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 80 సంవత్సరాలు నిండిన ఓటర్లను సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ విజయ్‌కుమార్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పిస్తామని చెప్పారు. ప్రజలు వారి ఓటు ద్వారానే కోరుకున్న వ్యక్తులను ఎన్నుకోవచ్చని పేర్కొన్నారు. ఓటు హక్కు ద్వారానే ఉత్తమ పాలన అందించే పాలకులను ఎంపిక చేసుకోవచ్చన్నారు. ఓటు లేని వారు వెంటనే ఓటుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య, హెచ్‌ఎం వై.దుర్గాభవాని, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

చేదోడు లబ్ధిదారుల జాబితా సిద్ధం



పెనమలూరు: మండల పరిధిలో జగనన్న చేదోడు లబ్ధిదారుల జాబితా సిద్ధం చేశారు. మండలంలో చేతి వృత్తుల వారికి ఆర్థిక సాయం చేయటానికి ప్రభుత్వం చేదోడు పథకంతో ఏటా రూ.10 వేలు ఆర్థిక సాయం అందిస్తుంది. ఇందులో భాగంగా అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మండల పరిధిలో 2023 సంవత్సరానికి మొత్తం చేదోడు పథకం కింద 308 మందికి ఆర్థిక సాయం అందించనున్నారు. ఈ మేరకు గంగూరు సచివాలయం-1 లో వెల్ఫేర్ కార్యదర్శి ప్రేమ్ సుధాకర్ లబ్ధిదారుల జాబితాను ప్రకటించారు.

రేపు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో స్పాట్ అడ్మిషన్లు

గన్నవరం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వివిధ కోర్సులకు సంబంధించిన మిగులు సీట్లు భర్తీ చేసేందుకు ఈ నెల 3న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వీవీ కృష్ణమోహన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో కంప్యూటర్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, మెకానికల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో మిగిలిన సీట్లు భర్తీకి తక్షణ ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. పాలిసెట్-2023లో సీటు రానివారు, ప్రవేశ పరీక్ష రాయని వారు, పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు టెన్త్ క్లాస్ మార్కుల లిస్ట్, పాలిసెట్‌కు హాజరైతే హాల్ టిక్కెట్, నాలుగు నుంచి పదవ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, టీసీలు, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు ఒరిజినల్స్, ఐదు సెట్ల జిరాక్స్‌లు, మూడు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో కళాశాలను సంప్రదించాలని తెలిపారు. కళాశాల ప్రవేశం నిమిత్తం రూ.6 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే గౌరవం



పునాదిపాడు సభలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టరు పి. రాజాబాబు

- జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు
- పునాదిపాడులో స్వచ్ఛత హీ సేవ

కంకిపాడు: గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆ గ్రామానికి గౌరవం దక్కుతుందని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. స్వచ్ఛతాహిసేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పునాదిపాడు గ్రామంలో ఆదివారం శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో ప్రధాని మోదీ పిలుపుమేరకు ఏక్ తారీఖ్-ఏక్ సాత్-ఏక్ ఘంట నినాదాన్ని అందిపుచ్చుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఒక గంట పాటు శ్రమదానం చేసి వీధులను, పరిసరాలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. కేవలం ఒక్క రోజు కార్యక్రమంలా కాకుండా నెలలో రెండు పర్యాయాలు శ్రమదానం చేసి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. పరిశుభ్రత నినాదం ఇంటింటికీ చేరాలన్నారు. తద్వారా ఆరోగ్యవంతమైన సమాజం, గ్రామాలు ఏర్పడతాయన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే ఆ గ్రామానికి గౌరవం లభిస్తుందన్నారు. చెత్త తొలగింపు పారిశుద్ధ్య కార్మికుల పని మాత్రమే కాదని, అందరి బాధ్యతగా గుర్తించి మసలుకోవాలని చెప్పారు. ఆరోగ్యవంతమైన సమాజానికి పరిశుభ్రత దోహదం చేస్తుందని పేర్కొన్నారు. తొలుత జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వర్‌నాయక్ కార్యక్రమ ఉద్దేశాన్ని వివరించారు. పారిశుద్ధ్య కార్మికులను జిల్లా కలెక్టర్ సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, సర్పంచ్ ముసిబోయిన విజయకుమారి, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ రామినేని రమాదేవి, ఆర్‌డీఓ విజయ్‌కుమార్, డీఎల్‌డీఓ నాంచారరావు, డీఎల్‌పీఓ సంపతకుమారి, తహసీల్దార్ పీఎస్‌వీ ప్రసాద్, ఎంపీడీఓ టీ.ఉదయభాస్కర్, ఈఓఆర్డీ మైథిలి, ఈఓ బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్వచ్ఛతా హీ సేవ..

గన్నవరం: మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక రైతుబజార్, ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సీఆర్పీఎఫ్ 39వ బెటాలియన్ ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. ప్రజ్ఞా స్కూల్, ప్రభుత్వ వసతి గృహ విద్యార్థులతో కలిసి సీఆర్పీఎఫ్ అధికారులు, సిబ్బంది పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం తొలగించి పరిశుభ్రం చేశారు. కమాండెంట్ ఆర్‌కే. పాండా, డెప్యూటీ కమాండెంట్ జీ దినేష్, సర్పంచి నిడమర్తి సౌజన్య, ఆర్టీసీ డీఎం పి.శివాజీ, రైతుబజార్ ఈవో చంద్రమోహన్ పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగిన శ్రమదానంలో జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, ఆస్పత్రి కమిటీ చైర్మన్ మన్నే సుందరరావు పాల్గొన్నారు. కేసరపల్లిలో సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌని ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవా ప్రత్యేక పారిశుద్ధ్య అవగాహన ర్యాలీ నిర్వహించారు. వార్డు సభ్యులు మూల్పూరు మాధవన్, పంచాయతీ కార్యదర్శి మౌనిక, పలువురు సిబ్బంది పాల్గొన్నారు. దావాజిగూడెం ఏలూరు కాలువ వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ఎయిర్‌పోర్ట్ ఉద్యోగులు, సిబ్బంది, భద్రతా సిబ్బంది తొలగించారు. స్థానిక సిల్వర్ జూబ్లి ఎంపీపీ స్కూల్ ఆవరణలో బీజేపీ ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. పార్టీ నాయకులు నాదెండ్ల మోహన్, శేషుమాధవీ, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వీధులను శుభ్రం చేస్తున్న జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, ప్రజాప్రతినిధులు



శ్రమదానంలో పాల్గొన్న సీఆర్పీఎఫ్ దళం, విద్యార్థులు



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్

రామవరప్పాడు : విజయవాడ రూరల్ మండలం పలు గ్రామాల్లో ఆదివారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించి శ్రమదానం చేశారు. ప్రసాదంపాడులో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సువర్ణరాజు, నిడమానూరులో శీలం రంగారావు, ఎంపీటీసీ, వార్డు సభ్యులు పాల్గొని సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నిడమానూరులో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ వద్ద శుభ్రపరిచి మొక్కలు నాటారు. ప్రసాదంపాడులో ప్రధాన గ్రామంతో పాటు కాల్వగట్టు ప్రాంతాల్లో చెత్తను తొలగించి శుభ్రం చేశారు. ఎనికేపాడు సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు, పంచాయతీ కార్యదర్శులు ప్రకాష్‌నాథ్, రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పెనమలూరు: స్వచ్ఛత కోసం విద్యార్థులు శ్రమదానం చేయాలని వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్ అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు కాలేజీలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్‌లు స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ సమాజం అభివృద్ధి పట్ల బాధ్యత ఉండాలన్నారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర పాల్గొన్నారు.



కేసరపల్లి స్వచ్ఛత ర్యాలీలో సర్పంచ్ తదితరులు



ప్రసాదంపాడు సేవా కార్యక్రమంలో జెడ్పీటీసీ సువర్ణరాజు తదితరులు



తేలప్రోలులో శ్రమదానం చేస్తున్న ఎంపీడీవో, తదితరులు



సచ్ఛత హి సేవలో పాల్గొన్న చైర్మన్ వల్లభనేని నాని

ఉంగుటూరు: పరిశుభ్రతే నిజమైన సేవా కార్యక్రమమని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో శేష గిరిరావు అన్నారు. తేలప్రోలులో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో పలు సూచనలు చేశారు. సర్పంచ్ లాం దిబోర, ఈవోపీఆర్‌డీ అమీర్ బాషా, కార్యదర్శి కృపాకుమార్ పాల్గొన్నారు.

ఉయ్యూరు: పరిసరాల శుభ్రత సామాజిక బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని నాని అన్నారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని ఉయ్యూరు పట్టణంలో ఆదివారం నిర్వహించారు. రోడ్లు ఊడ్చి చెత్త, వ్యర్థాలను తొలగించారు. పలు వార్డుల్లో ఆయా వార్డు కౌన్సిలర్లు పరిసరాల శుభ్రత పాటించారు. మండలంలోని 11 పంచాయతీ కార్యాలయాల్లో ప్రజా ప్రతినిధులతో కలిసి అధికారులు స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు సోలే సురేష్ బాబు, అర్షతున్నీసా బేగం, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, కో ఆప్షన్ సభ్యుడు షేక్ ఖలీల్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: పరిసరాల పరిశుభ్రత పాటించటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. స్వచ్ఛతాహీసేవ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు హనుమాన్‌జంక్షన్‌లోని పాలశీతల కేంద్రం ప్రాంగణంలో ఆదివారం శ్రమదానం చేశారు. పరిసరాలను శుభ్ర పర్చటంతో పాటుగా మొక్కలు నాటారు. హనుమాన్‌జంక్షన్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద బాపులపాడు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. ఎంపీడీవో జోగేశ్వర రావు, సర్పంచ్ సరిపల్లి కమలాభాయి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ హాజరయ్యారు.

ఘనంగా గణనాథుల నిమజ్జనోత్సవం



పెనమలూరు పల్లిపేటలో ఏర్పాటు చేసిన గణనాథుడిని ఊరేగిస్తున్న భక్తులు

పెనమలూరు: వినాయకచవితి మహోత్సవాల్లో భాగంగా చివరి రోజు ఆదివారం మండల పరిధిలో గణనాథుల విగ్రహాలను పలు గ్రామల్లో పెద్ద ఎత్తున ఊరేగించారు. పెనమలూరు పల్లిపేటలో 12 అడుగుల వినాయకుడి విగ్రహానికి ఈ గత నెల 18 నుంచి 1వ తేదీ వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి రోజు గణపతి హోమం, మహాకుంభ పూజ పెద్ద ఎత్తున చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. డప్పులు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యుద్దీపాలతో అలంకరించి వినాయకుడిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పోరంకి, యనమలకుదురు, కానూరు, తాడిగడప ప్రాంతాల్లోనూ గణనాథులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై ఊరేగించారు. ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సంక్షేమ పాలనకు గణనాథుడి ఆశీస్సులు



ఉయ్యూరులో విఘ్నేశ్వరుడికి పూజల్లో ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌తో పాటు భక్తులు

ఉయ్యూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ప్రభుత్వానికి గణనాథుడి దీవెనలు, ఆశీస్సులు ఉన్నాయని పామర్రు ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ అన్నారు. ఉయ్యూరు పట్టణంలోని సాయిమహల్ సెంటరులో వైఎస్సార్ సీపీ యూత్, సాయిమహల్ యూత్ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం భారీ అన్నసంతర్పణ నిర్వహించారు. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. ఉత్సవ కమిటీని అభినందించారు. ప్రజలందరూ సుఖశాంతులతో, భోగభాగ్యాలతో తులతూగేలా విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌ను జంపాన రవికుమార్, యూత్ సభ్యులు ఘనంగా సత్కరించి, వినాయక ప్రతిమను అందించారు.

లబ్ధిదారులకు సామాజిక పింఛన్లు పంపిణీ



నున్న గ్రామంలో పింఛను అందజేస్తున్న వలంటీరు సునీత



తాడిగడపలో పింఛన్ అందచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలో ఆదివారం 76.21 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశామని ఇన్‌చార్జి ఎంపీడీఓ బీఎల్‌వీ శేషగిరిరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 17 వేల 307 మంది లబ్ధిదారులకు రూ.4 కోట్ల 82 లక్షల 38 వేలను ప్రభుత్వం విడుదల చేయగా మొదటి రోజున 76.21 శాతం మందికి రూ.3 కోట్ల 67 లక్షల 9 వేలను పంపిణీ చేశామని తెలిపారు.

88 శాతం పింఛన్ల పంపిణీ

రామవరప్పాడు : విజయవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లను ఆయా గ్రామాల్లోని అర్హుల ఇంటింటికి వెళ్లి వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఆదివారం తెల్లవారుజాము నుంచే పంపిణీ చేశారు. వృద్ధాప్య, ఒంటరి మహిళ, దివ్యాంగ పింఛన్లు కలిపి రామవరప్పాడులో మొత్తం 90 శాతం, ఎనికేపాడులో 92 శాతం, ప్రసాదంపాడులో 93 శాతం, నిడమానూరులో 70 శాతం పంపిణీ చేశారు. తొలి రోజు అన్ని గ్రామాలు కలిపి 88 శాతానికి పైగా పంపిణీ పూర్తి చేశారు.

వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ

పెనమలూరు: మండల పరిధిలో ఆదివారం వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారులకు అందజేశారు. మండలంలో 5,755 మందికి రూ.1,59,34,750, డాక్టర్ వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీలో 12,853 మందికి రూ.3,59,24,500 పింఛన్ సొమ్ము ప్రభుత్వం మంజూరు చేసింది. మొత్తం 18,608 మంది లబ్ధిదారులకు రూ.5.18 కోట్లు నిధులు విడుదల చేయటంతో ఆదివారం ఉదయాన్నే ఆయా సచివాలయాల పరిధిలో సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు. తాడిగడపలో అన్నం సాయిబాబు అనే వ్యక్తి కాళ్లకు శస్త్ర చికిత్స జరగటంతో వెల్ఫేర్ అసిస్టెంట్ రంజిత్ కుమార్ అతని ఇంటికి వెళ్లి ఫేస్ యాప్ ద్వారా పింఛన్ సొమ్ము అందచేశారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందించిన వలంటీర్



ఉంగుటూరు: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలికి వలంటీర్ నాగనబోయిన కృష్ణకుమారి పింఛను అందజేసింది. మండలంలోని వేంపాడుకు చెందిన రంగమ్మ గుండె సంబంధించిన వ్యాధితో చిన్న అవుటపల్లిలో పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. దీంతో వలంటీరు ఆస్పత్రికి వెళ్లి వృద్ధాప్య పింఛను అందజేసి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంది. పలువురు వలంటీరు సేవలను అభినందించారు.

80 మందికి వైద్య సేవలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: మంచి ఆహారపు అలవాట్లు పాటించటం ద్వారా గుండె సంబంధిత జబ్బులకు దూరంగా ఉండవచ్చని ప్రముఖ కార్డియోలజిస్ట్ వీరమాచినేని స్వరాజ్యం అన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా స్థానిక విజయవాడరోడ్డులోని అన్వి సూపర్ స్పెషాలిటీ క్లినిక్‌లో ఆదివారం ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం ద్వారా అధిక రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులను తగ్గించుకునే బాధ్యత మనపైనే ఉందని డాక్టర్ స్వరాజ్యం చెప్పారు. సున్నితమైన హృదయ సంబంధిత సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందని ఆమె తెలిపారు. స్రవంతి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో డాక్టర్ స్వరాజ్యం, డాక్టర్ పొలవరపు కల్యాణ చక్రధర్‌లు రోగులకు బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో, రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించి పలు వైద్య సలహాలను అందించారు. సుమారు 80 మందికి వైద్య సేవలు అందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. స్రవంతి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్, డైరెక్టర్ శ్రీదేవి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జాషువా సాహిత్యం సామాజిక అంశాలకు దర్పణం



అస్మదీయం, అనంత ఆకాశంలో కవితా సంపుటి ఆవిష్కరిస్తున్న అతిథులు

విజయవాడ కల్చరల్: కవి జాషువా సాహిత్యం సామాజిక అంశాలకు దర్పణంగా భావించవచ్చని జాషువా కళాపరిషత్ వ్యవస్థాపకుడు పెద్దీటియోహాన్ అన్నారు. పద్మభూషణ్ జాషువా కళాపరిషత్ ఆధ్వర్యంలో ఎంజీరోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో ఆదివారం గుర్రం జాషువా 128 జయంతి వేడుకలు, కవి సమ్మేళనం, గ్రంథాల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. యోహాన్ మాట్లాడుతూ జాషువా కవిత్వ వేదనాభరతమై సందేశాత్మకంగా సాగుతుందన్నారు. కళాపరిషత్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు గడ్డం విజయరావు మాట్లాడుతూ జాషువా కవిత్వానికి ఎల్లలు లేవని తెలిపారు. కవయిత్రి డాక్టర్ సాంబేలు శాంతిబాయ్ మాట్లాడుతూ నేటి యువ కవులు ఆయన సాహిత్యాన్ని అధ్యయనం చేయాలని సూచించారు. సంపాదకుడు కలిమిశ్రీ, కవులు సిరికొండ నరసింహరాజు, శిఖా ఆకాష్,డాక్టర్ రంగిశెట్టి రమేష్ ప్రసంగించారు. అస్మతున్నీసా రచించిన అస్మదీయం, అనంత ఆకాశం, దాసరి ఆదినారాయణ రచించిన అనంత ఎర్ర సితార కవితా సంపుటాలను ఆవిష్కరించారు. దాసన్నగారి కృష్ణమూర్తి, డాక్టర్ సాంబేలు శాంతిబాయ్‌లకు జాషువా విశిష్ట పురస్కారాలను, వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన కవులకు జాషువా పురస్కారాలను అందించారు. కవులు స్వీయకవితాగానం చేశారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయండి



రక్తదానం చేస్తున్న సిబ్బంది

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఉషా రాణి అన్నారు. జాతీయ రక్తదాన దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం ప్రభుత్వాస్పత్రి సిబ్బంది రక్తదానం చేశారు. ఆస్పత్రిలో బ్లడ్‌బ్యాంక్‌లోని శిబిరంలో ఎంఎన్‌ఓలు, సెక్యూరిటీ సిబ్బంది 23 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఉషా రాణి మాట్లాడుతూ రక్తదానం ద్వారా ప్రాణదాతలుగా నిలవాలని సూచించారు.

రక్తదాన ఆవశ్యకతను గుర్తించాలి



గన్నవరం: స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం వాకర్స్ అసోసియేషన్, వాసవీ క్లబ్ గన్నవరం మిత్ర సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. తొలుత రక్తదాన శిబిరాన్ని రెడ్‌క్రాస్ జిల్లా కార్యదర్శి శంకర్నాథ్ భవిరి ప్రారంభించారు. అనంతరం డాక్టర్ శివప్రసాద్ పర్యవేక్షణలో 17 మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. రక్తదానం చేసిన దాతలకు నిర్వాహకులు జ్ఞాపికలను బహూకరించారు. సమాజంలో రక్తదానానికి ఉన్న ఆవశ్యకతను ప్రతిఒక్కరూ గుర్తించాలని చెప్పారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మదుపల్లి బాలకృష్ణమూర్తి, వీసం ప్రసాదరావు, వ్యవస్థాపక అధ్యక్షుడు ముక్కామల సుబ్బారావు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వీవీ కృష్ణమోహన్, వాసవీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కందగడ్డల లక్ష్మణ్, తవ్వ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరులో రక్తదాన శిబిరం

ఉయ్యూరు: లయన్స్ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. పట్టణంలోని కాటూరు రోడ్డులో ప్రజ్ఞ చెస్ట్ ఆసుపత్రిలో పలువురు రక్తదాతలను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్, డాక్టర్ కృపా సాగర్, ప్రతినిధులు ఊర కిషోర్, నెల్లి రాంబాబు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష సర్వే



గన్నవరం రూరల్ : మండలంలోని గ్రామాల్లో ఆదివారం జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ముమ్మరంగా జరిగింది. ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాల వ్యాధులకు పరీక్షలు చేసి వారి ఆరోగ్య పరిస్థితులను నమోదు చేశారు. చనుపల్లివారిగూడెంలో ఏఎన్‌ఎం మేరీగ్రేస్, ఆశాలు స్థానికులకు పరీక్షలు నిర్వహించారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ



విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తున్న తానా ప్రతినిధి ఠాగూర్ మల్లినేని

పెనమలూరు: పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు ఆదివారం ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ప్రతినిధి ఠాగూర్ మల్లినేని ఉపకార వేతనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు అండగా ఉండటానికి 15 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.1.50 లక్షలు ఉపకార వేతనాలు పంపిణీ చేశామన్నారు. రానున్న రోజుల్లోనూ తానా నుంచి తన వంతు సేవ చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం.వై.దుర్గాభవాని, ఎన్నారై ప్రతినిధులు పాలడుగు సుధీర్, మోర్ల నరేంద్రబాబు, కిలారు ప్రవీణ్, కోనేరు సాంబశివరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సర్వీసుల్లో ప్రోత్సాహక బహుమతులు

ఉయ్యూరు: గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆర్టీసీ సర్వీసుల్లో ప్రయాణికులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నామని డిపో మేనేజరు కెఎస్‌ఆర్‌కె ప్రసాద్ తెలిపారు. పెదసనగల్లు, చినపారుపూడి 222 సర్వీసుల్లో ఈ స్కీమ్‌లు అమల్లో ఉన్నాయన్నారు. ప్రయాణికులు బస్సుల్లో ఏర్పాటు చేసిన బాక్సుల్లో టిక్కెట్ వెనుక వైపు ఫోన్ నంబరు రాసి బాక్సుల్లో వేయాలన్నారు. లక్కీ డిప్ ద్వారా విజేతలను ప్రకటిస్తామని పేర్కొన్నారు.